

రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. సార్వత్రిక సోదర దినోత్సవాన్ని పురస్కరించుకుని తిలక్‌నగర్ బ్రహ్మకుమారి సామాజిక విభాగం ఆధ్వర్యంలో డీడీ కాలనీ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ ఆవరణలో శనివారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ ఇచ్చిన వారమవుతామన్నారు. రక్తం దానంతో నూతన రక్తకణాలు ఏర్పడి శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రక్తం దానం చేయాలని ఎమ్మెల్యే కోరారు. రక్తదాన శిబిరంలో 100 మంది పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో తిలక్‌నగర్ బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు డా.శ్రీలత సిస్టర్, సురేఖ, కవిత, బీఆర్ఎస్ నాయకుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని భరత్‌నగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి సెక్షన్ మేనేజర్ సురేశ్‌కుమార్‌కు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముషీరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో సురేశ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన నీటి సరఫరా సమయం మార్చడం వల్లే కొంత ఇబ్బందులు తలెత్తాయని, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు మోహిన్, రాజు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: మున్సిపల్ కమిషనర్

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో ఖేలో ఇండియా, అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగల్ 2025 పోటీలు నిర్వహించారు. తైక్వాండో రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 200మంది బాలికలు పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి సారించాలని కృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్‌ఖాన్, కోశాధికారి వరప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీవిద్యా ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ: కార్పొరేటర్ పావని



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో శనివారం కార్పొరేటర్ పర్యటించారు. వినాయక నిమజ్జనాలు ముగిసే వరకు డివిజన్‌లోని అభివృద్ధి పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని గణేష్ మండప నిర్వాహకులు కార్పొరేటర్‌ను కోరారు. వారి విజ్ఞప్తి మేరకు బస్తీలో ప్రారంభమైన నూతన సీవరేజ్ పైపులైన్ పనులను గణేష్ నిమజ్జనం అనంతరం కొనసాగించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఆమె వెంట వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, శంకర్, జగన్, జీహెచ్ఎంసీ 15 సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని ప్రముఖ ఆధ్యాత్మికురాలు డా. అనంతలక్ష్మి అన్నారు. అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో టీటీడీ ధర్మప్రచార పరిషత్ సహకారంతో ధర్మ ప్రచార్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హైందవ ధర్మాన్ని ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం అనంతలక్ష్మిని అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ సన్మానించారు. అంతకుముందు లలితాసహస్రనామ పారాయణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి అంజుబాబు, కోశాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌చారి

'అన్ని దానాల్లో అన్నదానం మిన్న'

ముషీరాబాద్/ చిక్కడపల్లి/ నల్లకుంట/రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ఆర్యవైశ్య సంఘం చిక్కడపల్లి అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌చారిలు అన్నారు. అమావాస్యను పురస్కరించుకుని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ గేట్ వద్ద, బీఆర్ఎస్ శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్దగల గౌరీ శంకర ఆలయం వద్ద, మాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యానగర్ కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, రాంనగర్ వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● నిరసన.. విరమణ



గణేష్ మండపాల ఏర్పాటుపై నల్లకుంట పోలీసుల ఆంక్షలను నిరసిస్తూ రాంనగర్ గుండూ చౌరస్తాలో అఖిలపక్ష పార్టీలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నల్లకుంట సీఐ జగదీష్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి ఆంక్షలు లేకుండా చూస్తామని చెప్పడంతో వారు నిరసన విరమించారు.

- రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

తాగునీరు సరఫరా చేస్తారా..
ధర్నా చేయమంటారా?

● జలమండలి అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహను సత్కరిస్తున్న రాంనగర్ కూరగాయల మార్కెట్ వాసులు, బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని, ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తారా లేదా మహిళలతో కలిసి జలమండలి కార్యాలయం ముందు ధర్నా చేయమంటారా అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను హెచ్చరించారు. ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కు కాలనీలో మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే శనివారం వైఎస్ఆర్ పార్కు కాలనీలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జలమండలి అధికారులతో మాట్లాడారు. నెల రోజుల నుంచి లోప్రెషర్ సమస్యతో నీరు సరిగా రావడం లేదని, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి మెరుగైన మంచినీటి సరఫరా చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఉన్న బోరింగ్‌లలో మురుగునీరు వస్తున్నాయని, వెంటనే బోరింగ్‌లను శుభ్రపరచాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రభాకర్, రాజు, వైఎస్ఆర్ పార్కు కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, కాలనీ నాయకులు యాదగిరి, వెంకటేష్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు తావులేకుండా కృషి

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల నిర్వహణలో రాజకీయాలకు తావులేకుండా కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని మణెమ్మగల్లీ, రాంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతాలలోని రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, సుధాకర్‌గుప్తా, సురేందర్, శ్రీనివాస్, రవి, దీన్‌దయాల్‌రెడ్డి, భాస్కర్, డీఈ సన్ని పాల్గొన్నారు.

దాయరం మార్కెట్ వీధిలో తాగునీటి కనెక్షన్‌లు ఇవ్వాలి..

ముషీరాబాద్ డివిజన్ దాయారం మార్కెట్ వీధిలో మంచినీటి సరఫరా పైప్‌లైన్‌లు వేసి నెలలు గడుస్తున్నా కనెక్షన్‌లు ఇవ్వలేదని, వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే గోపాల్ అధికారులను ఆదేశించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే దాయరం మార్కెట్ వీధిలో పర్యటించారు. స్థానికులు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోరక్‌నాథ్, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ కన్వీనర్‌గా వసంతచారి

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ డివిజన్ కన్వీనర్‌గా బీజేవైఎం సీనియర్ నాయకుడు వసంతచారి నియమితులయ్యారు. ఆయనకు శనివారం ఉత్సవ సమితి నియోజకవర్గం అధ్యక్షుడు మద్దూరి శివాజీ నియామక పత్రం అందజేశారు. అలాగే డివిజన్ ఉత్సవ సమితి కో కన్వీనర్లుగా రాహుల్ గౌడ్, భార్గవ్‌చారి, సాయినాథ్, తులసీ, లీగల్‌సెల్ ఇన్‌చార్జిగా క్రాంతి కుమార్‌లకు నియామకపత్రాలను అందజేశారు. వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామని వారు అన్నారు.

ఆర్టీసీ సేవలపై ప్రయాణికులు సంతృప్తి

● హైదరాబాద్ రీజియన్ ఆర్ఎం సుధాపరిమళ

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ అందిస్తున్న సేవల పట్ల ప్రయాణికులు, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రీజియన్ ఆర్ఎం సుధా పరిమళ అన్నారు. శనివారం డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సూచనలు, సలహాలు తీసుకుని బస్సులు నడిపిస్తున్నామని సుధా పరిమళ తెలిపారు.

మట్టి వినాయకులనే పూజించాలి



మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న అరవింద్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, న్యాయవాది భానుచందర్, ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

లోప్రెషర్ సమస్యను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లోప్రెషర్ సమస్య పరిష్కరిస్తానికి కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర చేశారు. లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కార్పొరేటర్‌ను కోరారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి దేశ ప్రజలకు తీరనిలోటు

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బలహీనవర్గాలు, దేశ ప్రజలకు తీరని లోటు అని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు అన్నారు. తన జీవితకాలం బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారని ఆయన గుర్తు చేశారు.

దళిత సంఘాల జేఏసీ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల జేఏసీ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా నర్సింగ్‌రావు నియమితులయ్యారు. శనివారం జేఏసీ అధ్యక్షుడు చంద్రు, వర్కింగ్ ప్రెసిడెంట్ చలిమెల్ల సునీల్‌కుమార్‌లు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి కల్పించిన జేఏసీ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జానపద అకాడమీ ఏర్పాటు చేయాలి: వక్తల డిమాండ్

● ఘనంగా అంతర్జాతీయ జానపద దినోత్సవం



కళాకారులకు అవార్డులు అందజేస్తున్న అనూహ్యారెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జానపదాన్ని రక్షించడానికి తెలంగాణ జానపద అకాడమీని వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, కోవిద ఆర్ట్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ జానపద దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అనూహ్యారెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ నృత్యం, నాటకం, సంగీతం, కళలు, ఫొటోగ్రాఫీ, జానపదం, భాషా సాహిత్యం వంటి విభాగాలను కలిపి ఒక సాంస్కృతిక సముదాయాన్ని నిర్మించాలన్నారు. సాంస్కృతిక కళాశాల ఆడిటోరియాలు, కాన్ఫరెన్స్ హాల్స్‌ను ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వారు అన్నారు. జానపద కళాకారుల వృత్తి, వికాసానికి నాంది పలకాలని వారు కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అర్హులకు జీవనభృతి నెలకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. 55 సంవత్సరాలు పైబడిన కళాకారులకు 5 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రతి కళాకారుడికి ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాములు, కార్యదర్శి హిమబిందు, విజ్ఞానదర్శిని అధ్యక్షుడు రమేష్, నృత్యగురువు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకునే కుట్ర

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

నల్లకుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పేరిట బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకునే కుట్ర చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ డిక్లరేషన్‌ను ముస్లిం డిక్లరేషన్‌గా బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తుందని ఆయన విమర్శించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్ అంశాన్ని ఆయా పార్టీలు వారి రాజకీయ కోసమే వాడుకుంటున్నాయని ఆరోపించారు. ఉపరాష్ట్రపతి విషయంలో టీడీపీ, జనసేన, బీఆర్ఎస్ వైసీపీ పార్టీల మద్దతు కోరిన రేవంత్‌రెడ్డి 42 శాతం బీసీ అంశంలో ఎందుకు ఆ పని చేయలేదని ఆయన ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయలని డిమాండ్ చేశారు. బీసీ నేతలు పందు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, వంశీకృష్ణ, అరుణ్, రమేష్, సంధ్యారాణి పాల్గొన్నారు.

25న సత్యాగ్రహ దీక్ష: సత్యం

బర్కత్‌పుర: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. ఈ దీక్షకు బీసీలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో సత్యాగ్రహ దీక్ష పోస్టరును శనివారం ఆవిష్కరించారు. బీసీ సంఘాల నాయకులు రఘురాం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్తర భారతీయుల సంక్షేమానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



రాజేంద్ర నిషాద్

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతీయుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు రాజేంద్ర నిషాద్ కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో జరుగుతున్న భవన నిర్మాణంలో ఉత్తర భారత కార్మికుల పాత్ర కీలకమైనదని అన్నారు. రోజువారి కూలీ డబ్బులు వారి జీవనానికి, కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. తమ అసోసియేషన్ పరంగా వారికి సహకారం అందిస్తున్నామని గుర్తు చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నీల్ నిషాద్, అరుణ్‌చౌహాన్, ఆనంద్‌లాల్‌శర్మ, జితేంద్రశర్మ, ప్రదీప్‌యాదవ్, దుర్గాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజాభివృద్ధికి పాటు పడాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన నోటు బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను చదివిస్తున్నారని, వారికి మంచి పేరు తెచ్చేలా చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, అమృత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆనంద్‌గౌడ్, నాగభూషణంచారి, రమేష్, తిరుపతిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

దంత రోగులకు మెరుగైన వైద్య సేవలు

● దత్తసాయి డెంటల్ ఆస్పత్రి ఎండీ డా.రంగారెడ్డి



డాక్టర్ రంగారెడ్డి

నల్లకుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దంత వ్యాధిగ్రస్తులకు రెండున్నర దశాబ్దాలుగా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని దత్తసాయి డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి తెలిపారు. శనివారం నల్లకుంటలోని దత్తసాయి డెంటల్ ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని దత్త సాయి డెంటల్ ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. నగరంలోని నల్లకుంట, అంబర్‌పేట, చైతన్యపురి, రామంతాపూర్, నాగోల్ తదితర ప్రాంతాలలో తమ ఆస్పత్రి సేవలందిస్తున్నదని ఆయన తెలిపారు. పేద ప్రజలకు ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించడమే కాక అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తాము అందిస్తున్న సేవలకు అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఐఐఎఫ్ఏ గ్రేటర్ అధ్యక్షుడిగా మైకేల్ ప్రసన్న

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇండో ఇజ్రాయెల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ (ఐఐఎఫ్ఏ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన మైకేల్ ప్రసన్న నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఐఐఎఫ్ఏ జాతీయ అధ్యక్షుడు డా.ఆడమ్‌రాజ్ దెక్కపాటి శనివారం ప్రకటించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైకేల్ ప్రసన్న మాట్లాడుతూ, ఇండియా, ఇజ్రాయెల్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మైకేల్ ప్రసన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్యులకు ఫెడరేషన్ అండ: సుజాత

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్యవైశ్య ఫెడరేషన్ అండగా ఉంటుందని వైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో 95 శాతం మార్కులు సాధించిన రాంనగర్ శ్రీతేజకు ఆర్థిక సాయం అందించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువు చదువుకోవడానికి ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గుప్తా, శివకుమార్, గంజి శ్రీనివాస్, రఘురాములు, వీరేందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆస్మిక కేర్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహనరావు

దివ్యాంగుల సర్టిఫికెట్ జారీ ప్రక్రియను సరళీకరించాలి

● ఆస్మిక అధ్యక్షుడు రామ్మోహనరావు

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సర్టిఫికెట్ జారీ ప్రక్రియను యూడీఐడీ సరళీకరించాలని ఆస్మిక అధ్యక్షుడు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఆస్మిక కేర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో మానసిక రోగుల కుటుంబాలు, సంరక్షుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసిక రోగుల కుటుంబాలు సంరక్షకుల భవిష్యత్తు కోసం సృజనాత్మక మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మిక ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రఫత్‌రజియా, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అపహరణ

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అపహరించారు. కాచిగూడ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావు విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి నగరానికి వస్తున్నాడు. నల్గొండ సమీపంలో ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. అదే విధంగా మరో రైలులో తమిళనాడు తిరుచ్చికి చెందిన హేతు రాజేష్ అశోకపురం ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుండగా మహబూబ్‌నగర్ సమీపంలో పర్సు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. వారిద్దరూ వేర్వేరుగా కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నల్గొండ, మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళ మృతి..

రైలు ఢీకొని ఓయూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందింది. ఈ నెల 16న కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న విషయం తెలిసిందే. శనివారం ఓయూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని సీఐ ఎల్లప్ప తెలిపారు.